# చల్లాను గెలిపిస్తే మరింత అభివృద్ధి



పరకాల ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి

- **ఆయన గెలిస్తే రైతుబంధు రూ.16వేలు వస్తది**
- **పరకాల నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్**

వరంగల్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పరకాల ప్రజలను కోరారు. శుక్రవారం పరకాల శివారులో జరిగిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యేగా ఉంటేనే పరకాల నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే ఇప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఉన్న రైతు బంధు ఆ తర్వాత రూ.16 వేలకు పెరుగుందని చెప్పారు. చల్లా ధర్మారెడ్డి గెలిస్తేనే 24 గంటల కరెంటు కొనసాగుతుందన్నారు. చల్లా దర్మారెడ్డి ఉత్తమమైన మనిషి అని కితాబునిచ్చారు. ధర్మారెడ్డి తన వద్దకు ఎప్పుడు వచ్చినా పరకాల నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే వస్తారని, వ్యక్తిగత పనులు ఏమీ అడగరని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గంలో సాగునీటికి అవసరమైన దేవాదుల, చలివాగు, ఎస్సారెస్పీ పనులు పూర్తి చేయాలని కోరుతారని చెప్పారు. పరకాలను అన్నివిధాలా మరింత అభివృద్ధి చేసుకుందామని, ఈ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. 'పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి మంచి మనిషి. మీకు మంచి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మల్ల మార్పు కోరుకునుడు ఎందుకు?. ఎవరైనా పాలిచ్చే బర్రెను వదులుకొని దున్నపోతును తెచ్చుకుంటరా? మంచిగ పని చేస్తున్న ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి. పరకాల అభివృద్ధి ఇంత కంటే వేగంగా జరుగుతుంది. పరకాల అభివృద్ధి బాధ్యత నాది' అని స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ సర్కారు చేసిన నిర్వాకాలతో ఉపాధి కోసం పరకాల ప్రజలు భీవండికి వలస పోయారని, తెలంగాణ వచ్చిన తర్వాత పరిస్థితి మారిందని గుర్తుచేశారు. దేశంలోనే అతి పెద్ద టెక్స్‌టైల్ పార్కును పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి చేసుకుంటున్నామని, త్వరలోనే దీన్ని ప్రారంభించుకుంటామని చెప్పారు. పరకాలలోని న్యాయవాదులు సూచించినట్లుగా ఇక్కడ కోర్టు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అవసరమైతే సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌తో సంప్రదించి పరకాలలో కోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలను తెలుసుకుంటామన్నారు. కోర్టు ఏర్పాటు కోసం ఏది ఉత్తమైన మార్గమో దాన్ని అనుసరించి పూర్తి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే అంతిమమని, ఎన్నికల్లో ప్రజలే గెలవాలన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను కష్టపడి అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని, ఇప్పుడు ఎవరి చేతిలోనో పెడితే రాష్ట్రం మళ్లీ వెనక్కి పోతుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటున్నామన్నారు. సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలంటే ప్రజలు ఆలోచించి తీర్పు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పదేండ్ల కష్టం బూడిద పాలవుతుందని చెప్పారు.

## రూ.5500 కోట్లతో రూపురేఖలు మార్చేశాం..

- **అభివృద్ధిలో పరకాలను అందలమెక్కించాం..**
- **సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే నియోజకవర్గ ప్రగతి**
- **ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



పరకాల, నవంబర్ 17 : సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే తొమ్మిదిన్నరేళ్లలో రూ.5.5వేల కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసి నియోజకవర్గ రూపురేఖలు మార్చామని పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెల్లంపల్లి రోడ్డులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలకుల హయాంలో పరకాల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కుట్రలు పన్ని పరకాల రెవెన్యూ డివిజన్‌ను రాత్రికి రాత్రే తరలించారని విమర్శించారు. కానీ ప్రతేక రాష్ట్రంలో పరకాలను అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. నియోజకవర్గంలో కొత్తగా రెండు మండలాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు రెవెన్యూ డివిజన్‌ను పునరుద్ధరించుకొని పాలనా భవనాలను కార్పొరేట్ తరహాలో నిర్మించుకున్నామని వివరించారు. పరకాల శివారులో వంద పడకల దవాఖాన నిర్మాణం శరవేగంగా జరుగుతున్నదని, అది పూర్తయితే చట్టుపక్కల మండలాలకు వైద్య సదుపాయాలు మెరుగవుతాయన్నారు. పరకాలలో ప్రధాన రహదారులన్నింటిని విస్తరించుకుని నలువైపులా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసుకున్నామని, బీఆర్ఎస్ పాలనలో పరకాల ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. అలాగే గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో సీఎం కేసీఆర్ చొరవతో దేశంలోనే అతి పెద్ద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నిర్మించుకున్నామని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వివరించారు. గీసుకొండ మండలంలో రూ.38 కోట్లతో చేపట్టిన కోనాయిమాకుల ఎత్తిపోతల పథకం పూర్తయిందని, దీని ద్వారా పలు మండలాల్లో 18.5వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని, సీఎం కేసీఆర్ పది కాలాల పాటు ఉంటేనే రాష్ట్రం, నియోజకవర్గం సుభిక్షంగా ఉండడమే గాక సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. అభివృద్ధిని ఓర్వని కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని కానీ ఆ పార్టీకే గ్యారెంటీ లేదని, స్కీముల పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. విపక్షాల మాటలు నమ్మొద్దని, నమ్మి ఓటేస్తే పాత రోజులు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, ఎంపీపీలు, జడ్పీటీసీలు సిలివేరు మొగిలి, కోడెపాక సుమలత, మచ్చ అనసూయ, కాగితాల శంకర్, బరిగె కల్పన, పోలీసు ధర్మారావు, కందగట్ల కళావతి, గూడ సుదర్శన్‌రెడ్డి, పరకాల, గూడెప్పాడ్ ఏఎంసీ చైర్మన్‌లు నిపానని హైమావతి, బొల్లెబోయిన రాధ, ఆయా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు మడికొండ శ్రీను, ధూరిశెట్టి చంద్రమౌళి, నేతాకుల సంజీవరెడ్డి, గుండు రాము, పసునూరి సారంగపాణి, వీరగోని రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు చింతం సదానందం, బిల్లా రమణారెడ్డి, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, బండి సారంగపాణి, బొజ్జం రమేశ్, సోదా రామకృష్ణ, రేగూరి విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# కౌశిక్ నా కొడుకులాంటోడు

- **హుజూరాబాద్ ప్రజలు గతంలో నన్ను బాధపెట్టిన్రు**
- **ఇప్పుడు కౌశిక్‌ను గెలిపించండి**
- **జమ్మికుంట ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్**

కరీంనగర్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : 'పాడి కౌశిక్‌రెడ్డి నా కొడుకులాంటోడు.. ఈటల రాజేందర్ పార్టీలోకి రాకముందే వీళ్ల నాన్న పాడి సాయినాథ్‌రెడ్డి బీఆర్ఎస్ జెండా మోసిండు.. హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని గెలిపించండి.. మీకు అండగా ఉంటా.. అన్నీ చేసిన నన్ను కాదని.. ఇంకెవన్నో ఎత్తుకుంటే మంచిదా? ఒకసారి ఆలోచించండి.. మంచి ఏదో.. చెడు ఏదో ఆలోచించాల్సిన అవసరం ఉంది' అని సీఎం కేసీఆర్ సూచించారు. శుక్రవారం జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మనకు ఏం చేసిందో మీకు తెలుసని, కాంగ్రెస్‌ను నమ్మి 2004లో పొత్తు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఇవ్వకుండా అనేక మంది బలిదానాలకు కారణమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ మనల్ని మోసం చేసిందని, ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చట్టాన్ని అతిక్రమించిందని, ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఇవ్వాల్సి ఉండగా తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో 157 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. నవోదయ పాఠశాలలు, మెడికల్ కళాశాలల కోసం వంద లేఖలు రాశానని గుర్తు చేశారు. కరెంట్ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారని, తెలంగాణలో నేను ఒప్పుకోకపోతే ఏడాదికి రూ.5 వేల కోట్ల చొప్పున ఇప్పటి వరకు రూ.25 వేల కోట్లు కోతలు పెట్టారని తెలిపారు. హుజూరాబాద్‌లో గెలిచి పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన ఈటల రాజేందర్ వీటి గురించి ఎందుకు మాట్లాడడని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి అని, బీఆర్ఎస్ అంటే పేదల పార్టీ అని స్పష్టం చేశారు. ఇక్కడి నుంచి గెలిచిన ఈటల రాజేందర్ నియోజవర్గానికి ఏమీ చేయలేదని, యువకుడు, సమర్థుడైన కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రైతు బంధు, 24 గంటల కరెంట్ రావాలన్నా, ధరణి కొనసాగాలన్నా కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలంటే హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డి గెలవాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి తాను ఏం తక్కువ చేయలేదని, పదేళ్లలో అన్ని సమకూర్చామని, ప్రతి రైతుకు రైతుబంధు ఇచ్చామని, దళితులందరికీ దళిత బంధు ఇచ్చామని గుర్తు చేశారు. ఇదే జోష్‌ను ఈ నెల 30 వరకు కొనసాగించి బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభలో మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డి

### గెలిపిస్తే రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి


**- పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి**

ఈ ఎన్నికల్లో నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కాళ్లు పట్టుకొనైనా రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. కమలాపూర్ మండలంలోని శనిగరం, ఉప్పల్, జమ్మికుంట మండలంలోని వావిలాల, వీణవంక మండలంలోని చల్లూరును మండలాలుగా ప్రకటించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లా. ఆయన కూడా సానుకూలంగా ఉన్నరు. ఈటల రాజేందర్‌ను పెద్ద నాయకుడిని చేస్తే.. ఆయన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిండు. హుజూరాబాద్‌లో 2004 నుంచి గెలిపిస్తున్న ఈటలను ఇక్కడి ప్రజలకు కూడా ధోకా ఇచ్చే విధంగా గజ్వేల్ ఆయన సొంతూరని చెబుతున్నడు. అక్కడ.. ఇక్కడి ప్రజలను మోసం చేస్తున్న ఆయనకు తగన బుద్ధి చెప్పాలె. ఇక్కడ ఎవరినో గెలిపిస్తే అభివృద్ధి ఎలా సాధ్యం. 15 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నా. ఒకే ఒక్క అవకాశం నాకిస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపెడ్తా. గత నాయకుడి లెక్క.. రంగులు మార్చెటోన్ని కాదు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా నగరం

- **చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్.. సుబేదారిలో ఎన్నికల ప్రచారం**

హనుమకొండ, నవంబర్ 17 : తొమ్మిదిన్నర ఏండ్లలో హనుమకొండ నగరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం సుబేదారి బడీ మసీద్ పరిసర ప్రాంతాల్లో ముస్లింలను కలిసి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని దాస్యం కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు.



హనుమకొండ : ముస్లిం మహిళలను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

### న్యాయవాదుల ప్రచారం..

వరంగల్ లీగల్ : దాస్యం గెలుపు కోసం బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉద్యమంలో వినయ్‌భాస్కర్ పోషించిన పాత్రను వివరించారు. అనంతరం దాస్యం మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా ఈ సారి కూడా తన గెలుపు కోసం పాటుపడాలని కోరారు. లీగల్ సెల్ నాయకుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, నర్సింహస్వామి, అనిల్ చందర్, వసంత్ కుమార్, ఇందిరా వైశాలి, సాధన పాల్గొన్నారు.

### ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తా..

హనుమకొండ సిటీ : నియోజకవర్గ ప్రజలు మరోసారి గెలిపిస్తే రాష్ట్రంలోనే పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని దాస్యం అన్నారు. 4వ డివిజన్ కృష్ణకాలనీలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమై మాట్లాడారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ కోసం నిధులు సమకూర్చానని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్ పాల్గొన్నారు.

